క్లుప్తంగా

అశ్వ వాహనంపై ఊరేగిన వేణుగోపాలస్వామి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం జరిగిన హరికథ ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన షణ్ముకి హరిదాసు మహిశాసుర మర్దినీ అనే కథను ఆసక్తికరంగా చెప్పారు. ఆర్యవైశ్య సంఘం వారు ఉభయదాతలుగా హరికథా కాలక్షేపాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ధ్వజా అవరోహణ, వసంతోత్సవం కార్యక్రమాలు జరిగాయి. కాగా ఉత్సవాలలో భాగంగా నేడు (బుధవారం) వేణుగోపాలస్వామికి పాన్పు సేవ జరుగనుందని ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కటాక్షం పొందాలని తెలిపారు.

మాజీ ఎంపీటీసీ మృతి


దుగ్గులమ్మ (ఫైల్)

చిన్నమండెం : మండల పరిధిలోని చాకిబండ గ్రామ మాజీ ఎంపీటీసీ రామిరెడ్డిగారి దుగ్గులమ్మ(90) మృతి చెందినట్లు ఆమె కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా దుగ్గులమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈమె మృతి పట్ల పలువురు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

పరామర్శ


సైంటిస్ట్ శంకర్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

నందలూరు : రాయచోటి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందలూరు మండలం నూకినేనిపల్లెకు సైంటిస్ట్ గణపతి శంకర్ దంపతులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్‌లు మంగళవారం కడపలోని గణపతి శంకర్ స్వగృహంలో దంపతులను కలిసి పరామర్శించారు. గాయపడిన ఇద్దరు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కడప పట్టణంలోని జీఆర్‌టీజీవీకే స్కూల్‌ను దంపతలిద్దరూ నిర్వహిస్తున్నారు.

ఘనంగా గణపతి హోమం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు : మండలంలోని రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే కొలువైన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా ఉదయం 7 గంటలకు శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి ఆలయ అర్చకులు నరసా రవిస్వామి ఆధ్వర్యంలో ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు గణపతి హోమం, లక్ష్మీగణపతి, శ్వేతార్క గణపతి హోమం నిర్వహించారు. మహాగణపతికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తే సర్వశుభాలు కలుగుతాయని అర్చకులు నరసా రవిస్వామి తెలిపారు.

నీటి కోసం నిరసన

ములకలచెరువు : స్థానిక కదిరి రోడ్డు ఉండే ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది నుంచి తాగునీటి కోసం అలమటిస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని మహిళలు వాపోయారు. సమస్యపై స్పందించిన ఎంపీడీవో పోలప్ప తాగునీటి ఎద్దడిని నివారించేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

570 లీటర్ల మద్యం, నాటుసారా ధ్వంసం

మదనపల్లె : ఎస్‌ఈబీ స్టేషన్, మదనపల్లె పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 570 లీటర్ల కర్ణాటక, ఆంధ్ర మద్యం, నాటుసారాను జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు వాల్మీకి సమక్షంలో ధ్వంసం చేసినట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చిప్పిలి విజయాడెయిరీ వెనుకవైపు నిర్మానుష్య ప్రదేశంలో మద్యం, నాటుసారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ... నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌కు సంబంధించి 56 కేసుల్లో సీజ్‌చేసిన రూ.1,19,602 విలువచేసే 284.795 లీటర్ల కర్ణాటక మద్యం, పరిమితికి మించి తరలిస్తూ.. 8 కేసుల్లో సీజ్‌చేసిన రూ.21,410 విలువచేసే 27.18 లీటర్ల ఆంధ్ర మద్యం, 15 కేసుల్లో పట్టుబడిన రూ.77,190 విలువచేసే 257.03లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

తంబళ్లపల్లె : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ త్యాగరాజు కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి బడి ఈడు పిల్లలను గుర్తించాలన్నారు. చిన్నారుల తల్లిదండ్రులతో చర్చించి పిల్లలను జూలై 12 లోపు బడిలో చేర్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ క్రిష్ణమూర్తి, ఎంఈఓలు పాల్గొన్నారు.

● వైభవంగా గెవిమాతమ్మ జాతర


ప్రత్యేక పూజలందుకున్న గెవిమాతమ్మ


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న దృశ్యం



మండల పరిధిలోని దేవపట్ల రెడ్డిగారిపల్లె సమీపంలో కొలువైన గెవిమాతమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాన్ని వివిధ రకాల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. రాత్రి మొక్కుబడులు కలిగిన భక్తులు చాందినీబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. ఊరేగింపు సందర్భంగా చెక్కభజనలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య కనుల పండువగా జాతర సాగింది. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. – సంబేపల్లె

అంగన్‌వాడీలపై కేసులను ఎత్తివేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు


విలేకరులతో మాట్లాడుతున్న నరసింహులు, పక్కనే అంగన్‌వాడీలు

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ కార్యకర్తలపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమపై పెట్టిన కేసు విషయమై మంగళవారం ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీలు కోర్టు వాయిదాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల తరబడి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోందన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలను అమలు చేయకుండా పాలకులు మోసం చేస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని అంగన్‌వాడీల ఆందోళన సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్‌లు హామీలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున అంగన్‌వాడీల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నేత బుక్కే విశ్వనాథనాయక్, ఏఐటీయూసీ నేతలు సాంబశివ, శ్రీనివాసులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు నాగేశ్వరి, సరోజమ్మ, అనురాధ, లంబాడా హక్కుల పోరాట సమితి నేత శంకర్‌నాయక్, రైతు సంఘం నేత వంగిమళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడమే మానవత ధ్యేయం


విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న మానవత ప్రతినిధులు

రాజంపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మండల పరిధిలోని తాళ్లపాక, కె.బోయినపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాపర్‌గా నిలిచిన ఆర్.వైష్ణవి, కె.స్పందనలకు మంగళవారం ప్రోత్సాహక బహుమతులను మానవత ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా మాట్లాడుతూ మండలంలో 12 ప్రభుత్వ హైస్కూల్‌లు ఉన్నాయన్నారు. ప్రతి స్కూల్‌లో టాపర్‌ను గుర్తించి వారికి మెమెంటో, ప్రశంసా పత్రంతోపాటు రూ.1000లు నగదును అందజేసినట్లు తెలియజేశారు. ఇప్పటికే 8 హైస్కూల్‌లలో విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలియజేశారు. విద్యార్థులను ప్రోత్సహించడమే తమ ధ్యేయంగా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వేణుగోపాల్ నాయుడు, పీసీ యస్‌మూర్తి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలి


మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ కె శ్రీనివాసులురెడ్డి

సుండుపల్లె : మండల మహిళా సమాఖ్య 17వ సర్వసభ్య సమావేశం మంగళవారం అధ్యక్షురాలు పి.నందిని అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ కె శ్రీనివాసులు రెడ్డి హాజరై అన్ని సంఘాలు, గ్రామ సమాఖ్యలు పుస్తక నిర్వహణ నెలవారీగా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. స్త్రీ నిధి ఏజీ ఉదయ్ కుమార్ పేటీఎం మిషన్లు పనితీరు గురించి వివరించారు. బ్యాంకు లావాదేవీలు, బ్యాంకు లోన్స్, సీసీఎల్, ఎఫ్‌పీజీ లోన్‌లు, పీఎంఈజీపీ లోన్స్ గురించి కెనరా బ్యాంక్ మేనేజర్ మస్తాన్, ఎస్‌బీఐ మేనేజర్ మాధవరెడ్డి, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణారెడ్డిలు తెలియజేశారు. అలాగే ఆడిట్ వివరాలు, లాభనష్టాల గురించి ఎంఎస్‌ఏ తెలియజేశారు. అనంతరం 2023–24 ఆర్థికసంవత్సరంలో నిర్వహించిన, చేపట్టిన కార్యక్రమాలు, ప్రగతి నివేదిక చదివి వినిపించి ఆర్థిక లావాదేవీలు చదివి వాటిపై చర్చించారు. అనంతరం కార్యనిర్వాహక సభ్యులు, పదాధికారులను కొత్తగా ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షురాలు, కోశాధికారిని కొత్తగా ఎన్నికైన వారిని సత్కరించారు. ఈ సమావేశంలో వంద మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ బడిని రక్షించుకుందాం .. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించండి అనే నినాదంతో యూటీఎఫ్ కడప జిల్లా శాఖ కరపత్రాలను ముద్రించింది. మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధ చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నైతిక విలువలు, చదువు, సంస్కారం దేశభక్తి, సమానత్వ భావనలతో విద్యాబుద్ధులు బోధిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం, ప్రభుత్వ బడిలోని సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియచేసి వారి పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పాటుపడుతోందని డీఈఓ మర్రెడ్డి అనురాధ కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు పివి రమణ, అడహక్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కృష్ణారెడ్డి, గోపీనాథ్, చంద్రశేఖర్, కేదార్నాధ్, కరీముల్లా, సమీర్‌బాషా, శివకుమార్‌రాజు, వెంకటసుబ్బయ్య, సురేష్‌కుమార్, సుబ్బారెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మేధస్వి పాఠశాల ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. పాఠశాల నిర్వహణ కోసం అనుమతి లేకున్నా.. ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులను నమ్మించి అడ్మిషన్లు పొందారని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభానికి ముందే కరపత్రాలు ద్వారా ప్రచారం చేసి అడ్మిషన్లు పొందారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు హరిబాబు, నాయకులు సాయి, సంతోష్, సుమంత్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సంకటహర పూజలు


ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ వినాయకుడికి సంకటహర పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రాత్రి వినాయకుడికి అభిషేకాలు, పూజలు జరిపారు. అభిషేకాలలో భాగంగా స్వామివారికి పవిత్ర జలం, తేనె, పాలు, పెరుగు, నెయ్యి, గంధం, తిలకంతో కలిపి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ఇష్టమైన గరిక (గడ్డి)తో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ పూజలు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు చేశారు.

ప్రయాణికులను గౌరవించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణీకులను గౌరవించాలని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం కడప నగరంలోని ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో హైర్ బస్సు డ్రైవర్‌కు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు ప్రయాణీకులు కీలకమన్నారు. వారి సహాయ సహకారాలతోనే సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. డ్రైవర్లు ప్రయాణీకుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ వారికి సేవలు అందించాలని కోరారు.

దళిత మిత్ర సంఘం మహా సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న అధ్యక్షులు రామాంజనేయులు

లక్కిరెడ్డిపల్లె : జూలైలో జరగబోవు దళిత మిత్ర సంఘం 7వ మహాసభను జయప్రదం చేయాలని దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. మంగళవారం అనంతపురం గ్రామంలో జిల్లా విస్తృతస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుల సమస్యల కోసం జూలై 21న కడప ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర మహాసభలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక, సామాజిక రాజకీయాలలో ఆత్మ గౌరవం, చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో శంకరన్న, ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి


జిల్లా సహాయ ఖజానా అధికారికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : నూతనంగా ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యి కొత్త డీడీఓ కోడ్‌లు కేటాయింపబడిన పాఠశాలల ఉపాధ్యాయుల పీఎఫ్ వారి వ్యక్తిగత ఖాతాలలోకి జమచేయులగా తగిన చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన యూటీఎఫ్ నేతలతో కలసి జిల్లా సహాయ ఖజానా అధికారి ఖాదర్‌వలీని కలుసుకుని మాట్లాడారు. 2023లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పలు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మారుస్తూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను డీడీఓలుగా నియమిస్తూ కోడ్‌లను కేటాయించారన్నారు. 2023 జూన్ నుంచి ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లోకి పీఎఫ్ జమ కావడం లేదన్నారు. జెడ్పీ సిబ్బందిని అడిగితే కొత్త ఉన్నత పాఠశాలల డీడీ కోడ్‌లు తమ కార్యాలయం పరిధిలోని ఆన్‌లైన్‌లో చూపడం లేదంటున్నారన్నారు. ఈ విషయాన్ని ఖజానా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటూ కోరారు. గత సంవత్సరం జూన్ నెల నుంచి వందలాది ఉపాధ్యాయుల లక్షలాది రూపాయల పీఎఫ్ సొమ్ము వారి వ్యక్తిగత ఖాతాలలో జమ కావడానికి ఆటంకంగా మారిన సాంకేతిక పరమైన సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం ఈ మేరకు జిల్లా జిల్లా సహాయ ఖజానా అధికారి ఖాదర్‌వలీకి యూటీఎఫ్ నేతలు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రాజారమేష్, రెడ్డి బసవయ్య, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల అలవెన్సు చెల్లించండి


తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న వీఆర్‌ఏలు

సిద్దవటం : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గ్రామ రెవెన్యూ సహాయకులు ఎన్నికలు విధులు నిర్వహించినా వారికి ఇవ్వాల్సిన బత్తా (అలవెన్స్) ఇవ్వలేదని మంగళవారం సీఐటీయూ వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, వీఆర్‌ఏలు తహసీల్దారుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వీఆర్‌ఏలు ఎన్నికల విధులు నిర్వహించినందుకు గతంలో ప్రభుత్వం బత్తా ఇచ్చేదన్నారు. ఈ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వీఆర్‌ఏలకు ప్రభుత్వం బత్తా ఇవ్వలేదన్నారు. ఈ విషయమై తహసీల్దారు రెవెన్యూ డివిజనల్ అధికారికి, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి మాకు బత్తా ఇచ్చేలా కృషిచేయాలన్నారు. వీఆర్‌ఏలను రాయచోటిలో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో విధులు నిర్వహించినా బత్తా ఇవ్వలేదన్నారు. రాజంపేటలో బ్యాలెట్ పేపర్ సెట్టింగ్‌కి టేబుల్‌లను ఏర్పాటు చేయించుకున్నందుకు రాజంపేట నుంచి వచ్చిన అధికారులు రోజుకు రూ. 500 రావాల్సి ఉండగా రూ. 300 మాత్రమే ఇచ్చారన్నారు. తమ వీఆర్‌ఏలకు ఎన్నికల విధులకు సంబంధించిన పూర్తి బత్తా చెల్లించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వారు తహసీల్దారు మురాషావలిని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు

సిద్దవటం : గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో మంగళవారం ఎంపీపీ ప్రతినిధి జ్యోతి చంద్రశేఖర్ అధ్యక్షతన అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. సిద్దవటం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలోని సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు. సిద్దవటం సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అతిసార వల్ల మరణాలు సంభవిస్తున్నాయని, అతిసార వ్యాధి ప్రబలుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అతిసార లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీలకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఈఓపీఆర్‌డీ లక్ష్మినరసయ్య, ఉపాధి ఏపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు పొలంలో మట్టి నమూనాలను సేకరించాలి


ఆర్‌బీకే సిబ్బందికి సూచనలు చేస్తున్న రమేష్‌బాబు

రాజంపేట రూరల్ : గ్రామ స్థాయిలో వ్యవసాయం చేసే ప్రతి రైతు పొలంలో మట్టి నమూనాలను సేకరించాలని ఆర్‌బీకే సిబ్బందికి వ్యవసాయ సహాయ సంచాలకులు జి.రమేష్‌బాబు ఆదేశించారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి బి.సాగరిక ఆధ్వర్యంలో ఆర్‌బీకేల సిబ్బందికి మట్టి నమూన సేకరణపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్‌బీకేల సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి మండలానికి 760 మట్టి నమూనాలను సేకరించే విధంగా లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలియజేశారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో 40 మట్టి నమూనాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. సాయిల్ హెల్త్ కార్డు యాప్‌లో నమోదు చేయడంతోపాటు మట్టి నమూనాను కడపలోని పరీక్షా కేంద్రానికి త్వరితగతిన పంపాలన్నారు. అనంతరం వచ్చే ఫలితాలను రైతులకు అందజేస్తే వారు సరైన మోతాదులో ఎరువులు వినియోగించుకొని అధిక దిగుబడి పొందుతారని చెప్పారు.


పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించను

శానిటేషన్ అధికారులు, సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక


శానిటేషన్ అధికారులు, వార్డు కార్యదర్శులతో సమీక్షిస్తున్న కమిషనర్ వాసుబాబు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ వాసుబాబు శానిటేషన్ విభాగం అధికారులను హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్ శానిటేషన్ అధికారులు, వార్డు కార్యదర్శులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నందున సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఇతర జిల్లాలో డయేరియా వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో మున్సిపల్ పరిధిలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అన్ని వీధులలో పారిశుధ్య పనుల నిర్వహణతోపాటు బ్లీచింగ్ పిచికారీని చేపట్టాలంటూ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాబోవు 100 రోజులను ప్రత్యేక పారిశుధ్య దినాలుగా పరిగణించాలంటూ కోరారు. ప్రతి వీధిలో బ్లీచింగ్‌తోపాటు దోమల నివారణ మందులు స్ప్రే చేసేలా చర్యలు తీసుకోవాలంటూ సూచించారు. మున్సిపల్ సిబ్బంది, కార్మికులు అంకితభావంతో పాటు పనిచేస్తూ సమయపాలనను పాటించాలంటూ సూచించారు. మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్యతో పాటు వార్డు శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నింగి, నేలకు ఎర్రంచు చీర


ఆకాశంలో కనువిందు చేసిన దృశ్యం

వర్షం వస్తుందని మేఘమాలిక ప్రజలకు చల్లని కబురు తెచ్చింది. నింగి నేల మధ్యలో ఎర్రంచు చీర కనువిందు చేస్తోంది. మబ్బుల మేఘాలు మందగమనంతో నేలపైకి దిగుతున్న ఈ మనోహరమైన దృశ్యం మంగళవారం సాయంత్రం కడప నగరంలో ఆవిష్కృతమైంది. – కడప అగ్రికల్చర్